# "జులుమ్"

శ్రీ పంతుల కృష్ణమూర్తి పంతులు

★

విశాఖపట్టణంలో కోర్టుపని చూచుకొని సాయంకాలం ప్యాసెంజరులో స్వగ్రామమైన అలమండ చేరుకుంటున్నాడు వీరన్న పంతులు. రైలుబండిలో కూర్చున్న కొద్ది వుక్క పోస్తూ వుండటంనుంచి క్లోజు కాలరు కోటువిప్పి కోర్టు కాగితాలవద్దనే పడల పరిచేడు "గాలిలేక పోవటం, ఈవుక్కతో ప్రాణాలు పోతున్నాయి చూడండీ" అని నావైపు చూచిఓ అర్థం లేని నవ్వు నవ్వుతూ తొడుక్కున్న కమీజుకూడా విప్పి యినుప చిక్కముపైని ఆరవేసేడు. ఆనవ్వువిని నే అటుతిరిగి చూచేసరికి ఆబల్లమీద వీరమఠము వేసుకొని 'ఆంధ్రపత్రిక' చదువుతున్నాడు.

మెల్లగా బండి వాల్తేరు స్టేషను విడిచి ప్రాకిపోతూంది. చల్లటి పైరుగాలిలోనికి ప్రవేశించి వీరన్న పంతులు చదువుతున్న కాగితాలను కంగారుపరుస్తూంది. బండి జోరులావయిన కొద్దీగాలి జోరుకూడా లావు అయింది. "వెధవగాలి! పత్రిక చదవనీయకుండా ఇలా తినివేస్తున్నా దేమిటి?" అని తిరిగీ అదేనవ్వు.

"పావుగంట క్రిందట గాలి లేదని, తీరా గాలి వేయగానే వెధవగాలి అని మీరే రిమార్కు చేస్తే ఏమి సబబుగా వున్నాదండీ!" అని నేను చలోక్తిగా నవ్వుతూ అనేసరికి 'సబబు ఏమిటి! సబబు! గాలివేస్తే వేయచ్చుగాని ఇంత వుప్పినిటయ్యా!' అని ఎగిరిపోతూ వున్న పత్రిక కాగితాలను సరిచేసుకోలేక భాధపడుతున్నాడు. అంతతో ఆతనితత్వం కొంత అవగాహన అయింది. తన ఇష్టప్రకారమే ఈ పంచభూతాలుసంచరించాలని అతడి వుద్దేశ్యమేమో! బండి సింహాచలం చేరుకుంటూంది. ఆపత్రిక జాగ్రత్తగా మణిచి కోటు క్రింద వుంచేడు.

'సింహాచలంలో సంపెంగ మొక్కలు చవగ్గా దొరుకుతాయి కదండీ?' అని తిరిగీ, నన్నే ప్రశ్న. నాకు జవాబు చెప్పేటందుకు మరి ఇష్టపడలేదు. తీరాఅవును అంటే మరేమి చికాకు వస్తుందో!

'అయ్యా! మిమ్మలనే! సంపెంగ మొక్కలు దొరుకుతాయా అని అడుగుతున్నాను'

'బహుశా దొరకొచ్చునేమో' అని నే క్లుప్తంగా చెప్పి వూరుకున్నాను. తిరిగీ నావైపు అదోమాదిరీగా చూచేడు. బండి స్టేషనుచేరి ఆగింది. అదృష్టవశాత్తు ఓ పువ్వుల కుర్రాడు సంపెంగ మొక్కలు అమ్మ తెచ్చేడు వీరన్న పంతులు ఓగావు కేకవేసి ఆ కుర్రాణ్ని పిలిచి ఎంతో కష్టముపైని పావులాఇచ్చి ఓ మొక్క తీసుకున్నాడు. ఆ మొక్క కుడిచేత్తో పట్టుకొని నాల్గు ప్రక్కలా పరీక్షించి 'పావులాకు నష్టంలేదు కదండీ' అని, వుండదని తిరిగీ తానే సమాధానము చెప్పుకున్నాడు. నాకు అతనివాలకం చూస్తే నవ్వువస్తూంది. ఎదురుగావున్న బల్లపైని ఆ మొక్క వుంచి నిదానంగా చూస్తున్నాడు. రివ్వుమని తల బద్దలయేటట్టు గాలి వీచుతూ హోరుమని రైలు ప్రయాణం చేస్తోంది.

'ఈసారి అయినా ఈ మొక్క బ్రతికి బాగుంటే నాకష్టం ఫలిస్తుంది. చూడటానికి మొక్క ధృఢంగాను సొగానూ కాన్పించినప్పటికీ—చూసేరు—ఇది బ్రతకడం బహుకష్టము సుమండీ! "తిరిగీ అతని మాటలు విన తప్పిందికాదు ఇష్టము లేకపోయినా రెండు మూడు ప్రశ్నలు 'ఊ, ఊ' అని కప్పించుకున్నాను. చివరకు అయ్యా! సంపెంగ మొక్కలు ఎటువంటి జాగాల్లో బాగుగా పెరుగుతాయండీ! ఎరువులు ఏమయినా తెలుసునా! అని తిరిగీ నన్నురేపేడు. 'వీల్లకాల్లో బాగా పెరుగుతాయని చెబుదామని నాలిక చివరవరకూ వచ్చింది కాని అతడు నాసలహాపైన ఎంత విశ్వాసముంచి అడిగేడో అని 'పచ్చమన్ను వుపయోగిస్తేబాగా పెరగొచ్చు' అని చెప్పి తప్పించుకున్నాను. ఇంతలో బండి కొత్తవలస చేరుకుంది.

అదికార గర్వంతో ఏటికట్! టికట్! అంటూ లోన ప్రవేశించాడో టికట్ కలక్టరు. వీరన్న పంతులు వులికిపడి లేచి తనకోటు జేబులన్నీ వెదకి టికట్ చూపేడు. టికట్ చూసేడన్న పేరేగాని టికట్గాని

టికెట్ కలక్టరు దృష్టిఅంతా అవటనవలాడుతున్న సంపెంగ మొక్కపైనే వున్నాది.

'ఎవరిదండి ఈ సంపెంగ మొక్క' అనినావైపు చూచి అడిగేడా టికట్ కలక్టరు మా యిరువురికీమందడిని ఆమొక్క వుంచటం నుంచి.

తాను చవగ్గా కొన్న మొక్కనుచూచి మెచ్చుకుంటున్నారేమో అనుకొని.

'సంపెంగ మొక్కండి! నాదే! సింహాచలంలో కొన్నాను. ఎన్నిసార్లు లేసినా మాదొడ్లో అవకుండా వుంది చూచేరు. ఈసారి వేస్తె అవుతుందేమో అని భ్రమ అని గుక్కతిప్పకుండా చెప్పటం ప్రారంభించేడు వీరన్న పంతులు.

'సరే! తమదేనా! చార్జి చెల్లించేరా!'

'దేనికి చార్జి'

'ఈ మొక్కకు'

'యీ మొక్కకు చార్జీ ఏమిటండీ! సబబులేని మాట!'

'ఆ! ఈ మొక్కకే చార్జీ! రైలుబండ్లలో మొక్కలు వూరకనే తీసుకొని వెళ్ళకూడదని రైల్వే వారి హుకుమ్. ఇది రూల్సుకి వ్యతిరేకము అందుచ చార్జీ చెల్లించాలి. పోనీ! ఇప్పుడైనా మించినది లేదు నాద్వారా చెల్లించండి. రసీదిస్తాను.'

'యీపాటి మొక్కకు చార్జీ ఏమిటండీ! ఎవరయినా నవ్విపోతారు! లక్షసార్లు నేకొని తీసుకొని వెళ్లేనుగాని ఇటువంటి నజ్జు గుజ్జులు పడలేదు.' అన్నాడు వీరన్న పంతులు ముఖం చిట్లిస్తూ.

'అనవసరంగా ఎందుకా మాటలయ్యా! రైల్వే రూల్సుకి వ్యతిరేకముగా నడవటమే కాకుండా పైగా ఈగడుసు ఖబుర్లు ఎందుకు! తెలిసో తెలియకో మొక్క తెచ్చినందుకు చార్జి చెల్లించీ!"

"చూచేరండీ! ఏమి సబబుగా వున్నాదో! మీరే చెప్పండి! గోసివంత మొక్కకు చార్జీట! అన్యాయం! అని నన్ను తగుమనిషిగా తిరిగీ ఆహ్వానించేడు వీరన్న పంతులు.

నేను ఎటు చెప్పేటందుకు వీలుగాని అవస్థలో పడ్డాను. వుభయులకు తారకంగా నా జవాబు వుండేటందుకు నే చాలా ప్రయత్నించేనుగాని నే వీరన్న పంతులు కోపానికి గురికావలిసి వచ్చింది.

'రూలు ప్రకారం మీరుచేసిన పని ఆయన చెబుతూవుండగానే కాదని ఎలా చెప్పగలను' అన్నాను నేను. 'మహాఘనమైన తీర్పుచెప్పేవయ్యా!' అన్నట్లు నావైపు క్రోధంగాచూస్తూ కిటికీవద్దకు పోయి కూర్చున్నాడు. టికట్ కలక్టరు అతనికి ఎదురుగా కూర్చొని చార్జి చెల్లించమని పీడుస్తున్నాడు.

'ఏమంటావయ్యా! వినిపించుకోకుండా వూరుకున్నావు'

'వినబడుతునే వున్నాది'

'చార్జి చెల్లించవేమిటి?'

'యీ మొక్కకు చార్జి ఏమిటండీ'

'తిరిగీ అదేమాట! రూల్సు అలవ్ చేయవు'

'మీరు యిష్టమై దయతలుస్తే యీరూల్సు ఏమిచేస్తాయండి'

'మేము అలా కంపెనీకి మోసం చేస్తామా! ముందు నీవు చార్జి! నేనీ గాడీ విడిచిపెట్టాలి'

'అయితే! స్టేషనులో మొక్కలుఅమ్మవచ్చునా! నేకొని తీసుకువెళ్లకూడదా!' అన్నాడు గడుసుతనము కనబరుస్తూ.

'నీవు మొక్క ఎక్కడకొన్నా బండిలో మాత్రం తీసుకొని వెళ్లకూడదు'

వీరన్న పంతులుకి ఏమిచేసేటందుకు పాలుపోయింది కాదు.

'నేనై ఈ మొక్కగురించి చార్జీ గీర్జీ చెల్లించదలుచుకోలేదు' అని మొండిగా మఠం వేసుకు కూర్చున్నాడు.

‘నేనూ నిన్నీరోజు విడిచిపెట్ట దలుచుకోలేదు! కానీ! పట్టుదలవస్తే ఏదో తెగతెంపులు కావాలి’ అని మరీ మొండిగా కూర్చున్నాడు టికెట్ కలక్టరు.

‘లాభము గూబల్లోకి వచ్చిందే’ అని నాలో నే అనుకొని ఏలాగు యీ జుజ్జు విడుతుందో అని వింతగా చూస్తున్నాను.

‘టికట్టువుండగా నన్ను ఎందుకు విడిచిపెట్టవు’

‘టికట్టువుంటే సరా! ఈ మొక్క గురించి చార్జీ ఎవరిస్తారు?’

‘యీ మొక్క గురించేనా నన్ను విడిచిపెట్టనంటున్నది’

‘అవును’

‘అ-యి-తే— ఇ-దు-గో’ అన్న మరుక్షణంలో సంపెంగ మొక్కను కిటికీలోనుంచి బయటకు విసిరేడు వీరన్న పంతులు.

‘ఆ! ఆ!’ అంటూ టికట్టు కలక్టరు చలనం లేకుండా కొయ్యబొమ్మలా నిల్చుండిపోయేడు.

నాకు వీరన్న పంతులు మొండి ధైర్యానికి సహయనూర్తికి ఆశ్చర్యం వేసింది. టికెట్ కలక్టరుని చూస్తే నవ్వువస్తూంది. పాపము టికట్ కలక్టరు ముఖంలో కోపము, ఉడుకుమోతుతనమూ, అసహాయత్వమూ స్పష్టంగా కానొస్తున్నాయి. ముగ్గురం ఒకరి ముఖాలు ఒకరు చూచుకున్నాము. అయిదు నిమిషాల వరకూ ఎవరినోటంటా మాటలేదు, బండి అలమండ చేరుకుంటూంది. టికట్ కలక్టరు కోపాన్ని ఆపుకోలేక ‘ఏమయ్యా! అలా పారేశావు!’ అని హుంకరించేడు.

‘మరి ఎలా ఈ పీడ వదుల్చుకోవటం’ అన్నాడు పంతులు.

‘పోనీ! నాకైనా ఇచ్చేసేవు కావే!’ అని తన కకూర్తిని బయలుపర్చేడు.

‘ముందుగా అలా అఘోరిస్తే ఈ తంతే లేకపోనే!’ అని అలమండలో దిగి ఇటే మాయమయి పోయేడు వీరన్న పంతులు.


మొదటి బహుమానం మీదే!

పోటీ పందెములలో పాల్గొనేవారు
వేలకొలదిగా ఆర్జించవచ్చు.

ఈనాడు తెనుగుపత్రికలలో వెలువడే పోటీపందెములలో సునాయాసంగా గెలుపొందడానికి
మీకు అవకాశం వుంది.

శబ్దార్థచంద్రిక

మీ దగ్గరవుంటే ఎటువంటి పజలునైనా అతిసునాయాసంగా నిముషాలమీద పూర్తిచేసి పారవేసి బహుమతులు పొందవచ్చు. ఇప్పటికి అప్పుడే యెందరో 886 పేజీల శబ్దార్థచంద్రిక తెప్పించుకొని లాభం పొందారు. శబ్దార్థచంద్రిక పదకోశము వెల రు 4-0-0 మాత్రమే. వి. పి. ఛార్జి వేరు. కావలసినవారు ముందుగా 2 రూపాయలు అడ్వాన్సుగా పంపాలి.

*

ఆంధ్రా బుక్ సర్వీస్, [కృష్ణా డైరీ]

21, ఎఱ్ఱబాలుచెట్టి వీధి, జి. టి. మద్రాసు.

